క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: నేషనల్ హైవే-44లో విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ వినాయక్‌రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సెంట్రల్ పార్క్, కుమ్మరి బస్తీ, ఆంధ్రబస్తీ, మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు...

గాయత్రినగర్, అపర్ణ ఫీడర్ పరిధిలో..
అపర్ణ ఫీడర్ పరిధిలోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్, వెంకటసాయి కాలనీ, మికాసా స్టెర్లింగ్, రాజధాని దాబా, అపర్ణ, స్ప్లెండర్ అపర్ణ, దేవేందర్ కాలనీ, గోదావరి హోమ్స్, గాయత్రి నగర్, టీఎస్ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మంద కృష్ణమాదిగ పోరాటాల ఫలితమే ఆరోగ్యశ్రీ

రంగారెడ్డినగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటాల ఫలితమే నేడు తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ పథకం అమలవుతోందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో కృష్ణమాదిగ పిలుపు మేరకు ఆరోగ్యశ్రీ ప్లకార్డులను ప్రదర్శించారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా నాయకులు సిల్వేరు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ పార్టీ మండల నాయకుడు యాదగిరి మాదిగ, ఓయూ విద్యార్థి నాయకుడు జెస్సీపాల్, రమేష్ మాదిగ, నరసింహులు మాల, మాదిగ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పద్మశాలి కులస్తులను ప్రోత్సహించాలి

రంగారెడ్డినగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కులస్తులను గుర్తించి అన్ని రంగాలలో ప్రోత్సహించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఏర్వ శంకరయ్య కోరారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని ఇందిరానగర్, శ్రీరామ్ నగర్‌లలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్, సంజయ్ గాంధీనగర్, పద్మారావు నగర్ రింగ్ రోడ్డు, గిరినగర్, భగత్‌సింగ్‌నగర్‌లలో జరిగిన వేడుకలకు ఆయన పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి కులస్తులు ఎంతో మంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. కార్పొరేషన్ల ద్వారా నిధులు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.


క్యూమార్ట్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు


హౌంస్‌బర్గ్ గేటెడ్ విల్లా ప్రధాన రోడ్డు


దుర్గంధభరితంగా సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డుమార్గం


సూరారం రాజీవ్‌గృహకల్పలో నివాసాల మధ్య మురుగు పారుతూ దుర్గంధంగా మారిన రహదారి

పారేదంతా వర్షపునీరు కాదు!

అది ప్రధాన రోడ్డు.. నిత్యం వందలాది వాహనాలు వేలాదిమంది రాకపోకలు సాగించే మార్గం. అయితే ఇక్కడ డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. వర్షం తగ్గి ఐదు రోజులు అవుతున్నా ఇక్కడి ప్రధాన రోడ్లు వరదను తలపించే విధంగా డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేసినా అదిగో ఇదిగో అంటూ కాలం వెల్లదిస్తున్నారు. కానీ పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారం రోజుల నుంచి ఈ ప్రధాన చౌరస్తాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని మూడు ప్రధాన మూల మలుపుల వద్ద ఈ సమస్య ఎదురు కావడం విశేషం. హౌంస్‌బర్గ్ గేటెడ్ విల్లా, సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్డు, క్యూమార్ట్ పక్కనే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ చిత్రాలు ఇవే.
– కుత్బుల్లాపూర్

లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు..!

- బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం
- బడానేతల సిఫారసుకు పెద్దపీట అంటూ ప్రచారం
- ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులు 22,087

తొలి విడతలో నియోజకవర్గానికి 300 మందికి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బీసీకుల, చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం పంపిణీకి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 24 మందికి సాయం అందించగా, ఆ తర్వాత మరో 120 మందికి కూడా రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం దరఖాస్తులు 22,087 రాగా, తొలి విడతలో ప్రభుత్వం విడుదల చేయనున్న నిధులబట్టి ఒక్కో నియోజకవర్గానికి 300 మందికి సాయం అందించాలని భావిస్తున్నప్పటికీ, ప్రభుత్వం విడుదల చేసే నిధుల ఆధారంగా లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే దరఖాస్తులను పరిశీలన చేసిన అధికారులు అర్హుల జాబితాపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. భారీగా దరఖాస్తులు రావడం.. అర్హుల ఎంపిక చేయడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. దీంతో ఎవరికి ఆర్థిక సాయం దక్కనుందోనని ఆశతో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

◆ జిల్లాలో వివిధ నియోజకవర్గాల పరిధిలో వేలాది దరఖాస్తులు వచ్చాయి. సర్కారు మార్గదర్శకాల ప్రకారం ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్ల ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తుల పరిశీలన చేశారు. తొలుత 250 మంది రూ.లక్ష ఆర్థిక సాయానికి అర్హులని అధికారులు గుర్తించారు. ఈ జాబితాపై కొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మరోమారు దరఖాస్తుల పరిశీలన చేయాలని అధికారులకు వారు సూచించినట్లు సమాచారం.

◆ **మార్గదర్శకాల ప్రకారమే..**
ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆర్థిక సాయం అందనుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తించామని పేర్కొంటున్నారు. తొలి విడత ఆర్థిక సాయం పంపిణీకి చర్యలు చేపడుతున్నా.. వేలాది మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి అదృష్టం వరిస్తుందోనన్న చర్చ సాగుతోంది.

◆ **సిఫారసు చేసిన వారికే..**
లబ్ధిదారుల ఎంపిక జాబితాపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఓ వైపు ప్రజాప్రతినిధుల ఒత్తిడితో.. వారు సూచించిన పేర్లను తొలి విడత జాబితాలో పొందుపరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేతలు సిఫారసు చేసిన వారికే ఆర్థిక సాయం అందనుందన్న ప్రచారం సాగుతోంది. వేలాది దరఖాస్తుల్లో అర్హులను గుర్తించడానికి అధికారులు తీవ్రంగా శ్రమించినా జాబితాల రూపకల్పనలో నేతల ప్రమేయం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారుల జాబితా రూపకల్పన ఇంకా కొలిక్కిరాలేదని తెలుస్తోంది.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోండి



దుండిగల్: తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని.. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు కోరారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సొంత స్థలం ఉన్న వారికి ఇళ్ల కట్టుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. అర్హులైన వారు ఈ నెల 10వ తేది లోపు ఇంటి పత్రాలు, రేషన్‌కార్డుతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నర్సింహులు, రెవెన్యూ అధికారి సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో కమిషనర్ సమావేశం..
18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరు గుర్తింపు కార్డుపై అవగాహన కల్పించాలని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్, కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.. సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శప్రాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ పథకాల విషయమై ఎమ్మెల్సీని కలిసి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్‌లు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకటిస్తాం


సొంటిరెడ్డి పున్నారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ కేలండర్‌ను ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌కు చెందిన మునావర్, అంజాద్, షరీఫ్, రఫీక్‌ల మిత్రబృందం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన పున్నారెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేసి యువతకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అవిజె జేమ్స్, సంజీవరెడ్డి, షఫీ, లాయక్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించడానికి బీటెక్ సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత, ఎలక్ట్రిషన్ టెక్నీషియన్ బోధనకు బీఈ సెకండ్ క్లాస్, ఎంపీహెచ్‌డబ్ల్యూ బోధనకు బీఎస్సీ నర్సింగ్ సెకండ్ క్లాస్, ఎంఎల్‌టీ కోర్స్‌కు ఎంబీబీఎస్, బీఎంహెచ్‌ఎస్, బీఫార్మసీ, ఎంఎస్సీ మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో సెకండ్ క్లాస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ బోధించడానికి బీఈ, బీటెక్ సెకండ్‌క్లాస్, పీఎస్ టీటీ బోధనకు బీఈ, బీటెక్ సెకండ్ క్లాస్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఈనెల 9వ తేదీలోపు తమ పూర్తి దరఖాస్తులను మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని విద్యాశాఖ అధికారులు ఓ ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. అతని ఒంటిపై గాయాలు ఉండడంతో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు (45-50) మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులు, కుంటలను పరిరక్షించడంలో విఫలం



నిజాంపేట్: చెరువులు, కుంటలను పరిరక్షించడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నం.331లో జరుగుతున్న అక్రమ ప్రాజెక్ట్‌ల విషయమై ఫిర్యాదు చేశారు. బాచుపల్లిలోని చెరువు బఫర్ జోన్‌లో ఏపీఆర్ ప్రాజెక్ట్, వాసవీ ఆర్బన్, ఆకృతి కన్‌స్ట్రక్షన్స్‌లు నిబంధనలకు విరుద్ధంగా చెరువు స్థలాలను ఆక్రమించి చేపడుతున్నా.. సంబంధిత కార్పొరేషన్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడు మాధవరావు, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు ఉన్నారు.

రేషన్‌కు 10 వరకు ఆగాల్సిందే.!

జగద్గిరిగుట్ట: ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ సరుకుల కోసం 10వ తేదీ వరకు ఆగాల్సిందే. కొన్ని సాంకేతిక కారణాల వలన రేషన్ సరఫరా ఆలస్యం కానుందని రేషన్ డీలర్లు తమ షాప్‌ల వద్ద స్టిక్కర్లు అంటించారు.

గుంతల రోడ్లపై బీజేపీ నిరసన

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో గుంతల రోడ్లను చూస్తేనే ఎంత అభివృద్ధి జరిగిందో అవగతమవుతోందని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజిరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కొంపల్లి 6వ వార్డులోని శివాలయం, రాయల్‌పార్క్, ఆశ్విని కాలనీ, నూజివిడు సీడ్స్ ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్ల విషయమై బీజేపీ నాయకులు పాదయాత్ర చేపట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్ రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని చెబుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు మెరుగు పర్చలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టడంలో చూపించిన చొరవ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు బాగు చేయడంలో చూపిస్తే బాగుంటుందన్నారు.

దేశం భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం


కావడి యాత్రలో వందలాదిగా పాల్గొన్న ఉత్తర భారతీయులు, కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: భారతదేశం భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంగీతా పాత్ర ఆధ్వర్యంలో సంజయ్ గాంధీనగర్‌లో నిర్వహించిన కావడి యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ఉత్తరాది సంస్కృతిలో భాగమైన ఈ వండుగను నగరంలో అనేక చోట జరుపుకుంటారని అన్నారు. మహా శివుడికి గంగా జలాన్ని సమర్పించి తమ భక్తిని చాటుకుంటారన్నారు. మహా శివుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, నాయకులు పత్తి రఘుపతి, సురేష్ గౌడ్, సైదులు, గణేష్ పాత్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి



సూరారం: ఆర్టీసీ డ్రైవర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు గండి మైసమ్మ నుంచి చార్మినార్ వెళ్తోంది. కాగా శివాలయ వద్దకు రాగానే వెనుక నుంచి యాక్టీవా బండిపై వచ్చిన ముగ్గురు యువకులు బస్సును ఆపి డ్రైవర్ మల్లారెడ్డిపై దాడికి దిగారు. దీంతో డ్రైవర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పిల్లలను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషన్ సభ్యులు అంజన్‌రావు, రాగజ్యోతి

దుండిగల్: పాఠశాలల్లో చదివే పిల్లలకు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అంజన్‌రావు, రాగజ్యోతి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాల, పేట్‌బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్, ఢిల్లీ పబ్లిక్, సాధు వాసవి పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలను మానసికంగా, లైంగికంగా లేక ఇతర ఏ విధంగానైనా ఇబ్బందులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఏదైన సమస్యను ఎదుర్కొంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదే విధంగా బాలల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, ఎంఆర్‌పీ రమేశ్, రామకృష్ణారెడ్డి, వెంకటరాములు, సుఖ్‌దేవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీ ప్రారంభం

జగద్గిరిగుట్ట: గాజులరామారం డివిజన్ లెనిన్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను కార్నివలి ఫౌండేషన్ దత్తతకు తీసుకున్న విషయం విదితమే. ఇటీవల రూ.56 లక్షలతో అదనపు గదులు, టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేసింది. అదే విధంగా లైబ్రరీని కూడా నిర్మించింది. పనులు పూర్తి కావడంతో సోమవారం కార్నివలి ఫౌండేషన్ డైరెక్టర్ రాధిక లైబ్రరీని ప్రారంభించారు. పాఠశాలలో దాదాపుగా అన్ని పనులు పూర్తయ్యాయని.. మిగిలిన పనులు వీలైనంత తొందరగా పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని వసతులు ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చంద్రశేకర్, హెచ్ఎం ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతివృత్తులదారులకు బాసటగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే వివేకానంద్


చేనేత దినోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే వివేకానంద్, పద్మశాలి సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: అన్ని సామాజిక వర్గాలు, చేతివృత్తులదారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్వారీ ఎన్‌క్లేవ్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు తీసుకువచ్చిందన్నారు. చేనేత కార్మికుల నెలకు 2,016 రూపాయల పింఛన్‌ను అందిస్తోందన్నారు. 'నేతన్న బీమా'పథకాన్ని ప్రవేశపెట్టి ప్రయోజనం కల్పించామన్నారు. అదే విధంగా రూ.28.96 కోట్ల చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేశామని తెలిపారు. పావలా వడ్డీ ద్వారా రూ.120 కోట్ల రుణాలను 523 సొసైటీలకు అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్, పద్మశాలి సంఘం నయకులు బేతి గోపాల్, ఎం.జనార్దన్, జల్దా లక్ష్మీనాథ్, హరికృష్ణ, వెంకటేష్, రఘునందన్, బాలు నేత, లక్ష్మీకాంత్, గజంశ్రీనివాస్, రాజేష్, అనంత రామ్, బి.అశోక్, ఆంజనేయులు, బోడ సాయిలు, అప్పారావు, నాగభూషణం, గుర్రం బాలరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.